శ్రీ గణేశాయనమః　　శ్రీ గురుదత్తాత్రేయనమః　　శ్రీ సరస్వత్యైనమః


# మరచిపోకుము దత్తుని మంచి మాట

(శంకర జయంతి కానుక)




ప్రమాధినామ సం॥
వైశాఖ శుద్ధ పంచమి
20-4-1999


ప్రొ॥ డా॥ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి
దత్తభక్తులు **M.Sc.Phd.**
రామిరెడ్డి పేట, నరసరావుపేట



శ్రీ దత్తసేవలో శ్రీ చిలుకూరు బాలకృష్ణమూర్తి, ధర్మపత్ని శ్రీమతి భవాని



దత్తబంధు.... శ్రీ కోనేరు సత్యనారాయణ, వారి ధర్మపత్ని శ్రీమతి
కోనేరు శివకాంచనలత గురుదక్షిణ రు. 10/-

శ్రీ గణేశాయ నమః   శ్రీ గురుదత్తాత్రేయాయ నమః   శ్రీ సరస్వత్యై నమః

# శ్రీదత్త భగవానుడు

**నదత్తా దపరో దేవః న ప్రేమ్ణః పరసాధనమ్॥**

తా॥ శ్రీదత్తుని కన్నా వేరు దైవము లేదు. దైవ ప్రేమకన్నా వేరు సాధనము లేదు.

**ఏక మేవ అద్వితీయం బ్రహ్మ**
**యతోవా ఇమాని భూతాని**
**జాయన్తే యేన జాతాని జీవన్తి**
**యత్ప్రయన్త్యభి సంవిశన్తి**

అనగా బ్రహ్మ యొక్కటే. రెండవది లేదు. దేని నుండి ఈ పంచభూతములు పుట్టి దేనిచే నిలచి, దేనియందు లయించుచున్నవో అదే బ్రహ్మము.

"యత్సాక్షా దపరోక్షా ద్బ్రహ్మ"- అనగా పరబ్రహ్మము ప్రత్యక్షమగుట కూడా శ్రుతిచే చెప్పబడినది. కనుక త్రిముఖ షడ్భుజ రూపమే పరబ్రహ్మము. మిగిలిన రూపాలు బ్రహ్మము యొక్క వేషాలే కాని అసలు రూపాలు కావు.

## విన్నపము

భక్త మహాశయులారా!

శ్రీ దత్త భగవానులు ప్రత్యక్షంగా వచించి "శ్రీదత్తగురు భగవద్గీత" గ్రంథము (16 అధ్యాయములు తెలుగు తాత్పర్యంతో) సిద్ధముగా యున్నది. వలయు వారు రు. 101/- చెల్లించి గ్రంథమును పొందవచ్చును. లేక రు. 116/- లు గురుదక్షిణ **M.O./D.D.** ద్వారా పంపి ఈ పవిత్ర గ్రంథమును పోస్టు ద్వారా పొందవచ్చును. గ్రంథము రిజిష్టర్డు పోస్టులో పంపబడును.

**చిలుకూరు బాలకృష్ణమూర్తి**
41-15-4 నల్లగేటు డౌన్
కృష్ణలంక, విజయవాడ-13
ఫోన్ : **521 809.**



శ్రీ మహాగణపతయే నమః



శ్రీ సరస్వత్యై నమః

శ్రీ గురుదత్తాత్రేయ నమః

# తొలి పలుకు

ఈనాడు పవిత్ర దినం. శ్రీ దత్త భక్తులు శ్రీ జన్నాభట్ల వేణు గోపాల కృష్ణమూర్తిని ఆవహించి శ్రీ దత్త భగవానులు ధారాపాతంగా వర్షించిన శ్రీ దత్త బోధామృతము- పద్యకావ్యము "మరచిపోకుము దత్తుని మంచిమాట" ఈ ధారామృతమును గ్రంథస్థం చేసి భక్తులకు అందించే భాగ్యాన్ని శ్రీ దత్త భగవానులు మా దంపతులకు ప్రసాదించారు. ధన్యులం. ఇందు వేద నిర్వచనమైన శ్రీ పరబ్రహ్మ స్వరూపం- సాధన- జీవుడు స్వార్థముతో కోరికలతో పాపముల నాచరించుట- కష్టములు రాగానే భగవంతుని కాళ్ళపై బడుట- కష్టములు తీరగనే భగవంతుని మరచిపోవుట- మరల యథాప్రకారముగా పరుల ధనములకు- పరుల భార్యలకు ఆశ పడుట- పులుపు, కారము తిని చాపల్య చిత్తుడగుట- టీవిలు, సినిమాలకు అలవాటు పడుట- ఉద్రేకము పెంచుకొనుట- కొందరు భగవంతుడే లేడను నాస్తికత్వమునకు పాలగుట- తాను పెంచిన గొర్రెను తానే చంపి భుజించుట- పతితు లగుట చక్కగా వచింనారు. శ్రీ దత్తభగవానులు ఇట్టి జీవుల నుద్ధరించుటకే అనేక రూపములతో ఈ మర్త్యలోకమున అవతరించి- నాలుగు కులాలకు బ్రహ్మము చేరుటకు మార్గము లున్నవనియు- వంచకుడు శిక్షింపబడుననియు- పాపము చేసిన వానికి శిక్ష తప్పదనియు,

యమ ధర్మరాజంతటి వానికి కూడా శిక్ష తప్పలేదనియు- వచించి- జీవు నికి ధర్మ మార్గమును విశ్లేషించి అనుగ్రహించిరి. నాయనలారా! నీ బిడ్డ లపై ఎట్టి ప్రేమను చూపగలుగుచున్నావో అట్లే భగవంతునిపై చూపిన ఉద్ధరింపబడగలవని ఉద్ఘాటించిరి. దగ్గరగా నున్న వ్యక్తిపై విలువ తగ్గు ననియు, దూరముగా ఉన్న వానిపై విలువ పెరుగునననియు- కనుక భగ వంతుని ఎట్టి కోర్కెలు లేకుండా నిస్వార్థంగా అచంచల భక్తితో సేవించి తరించవలెనని బోధించారు. ఆహా! స్వామీ! ధన్యులము.

## శ్రీ దత్త భక్తుల పరిచయం

నరసరావుపేట వాస్తవ్యులు సుప్రసిద్ధ సిద్ధాంతి జ్యోతిష్కులు శ్రీ జన్నాభట్ల వీరభద్రయ్య, హనుమాయమ్మ పుణ్యదంపతుల పుత్ర రత్నమే దత్త భక్తులు శ్రీ వేణుగోపాల కృష్ణమూర్తిగారు. వీరు **M.Sc., P,hd.** కెమిస్ట్రి ప్రొఫెసరు. ప్రస్తుతం కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగు కాలేజీలో పనిచేయుచున్నారు. వీరు శ్రీ దత్తభగవానుల సాక్షాత్కారాన్ని, అనుగ్రహాన్ని పొందిన మహనీయులు. వీరు సంస్కృతంలో 60కి పైగా గ్రంధాలు రచించిన ధన్యజీవులు. శ్రీ దత్తభగవానులు ప్రత్యక్ష దర్శన మొసగి వచించిన దివ్యవాణియే శ్రీ దత్త గ్రంధమాలగా వెలువడింది. శ్రీ దత్త వేదము, శ్రీ దత్తగురు భగవద్గీత ప్రధానములు. శ్రీవారు ఇప్పుడు ఉపనిషత్తులు వచించుచున్నారు. త్వరలో వానిని ప్రచురించి భక్తకోటికి అందించు భాగ్యమునకై ఎదురు చూచుచున్నాము.

**ఆరంభ గుర్వీక్షయిణీ క్రమేణ**
**లఘ్వీ పురావృద్ధి ముపైతి పశ్చాత్"-**

సత్కార్యము సాయంకాలపు నీడవలె ఆరంభమున స్వల్పముగ నుండి క్రమముగ విస్తరించును. అసత్కార్యము ఉదయకాలపు నీడవలె ముందు ఎక్కువగ నుండి క్రమముగ క్షీణించును. అట్లే శ్రీ దత్తభక్తులు

మా ఇంటిలో శివరాత్రి భోజనానంతరము ఆరంభించిన సత్సంగ సంభాషణము ఈనాటికి యిన్ని గ్రంథములుగా విస్తరించినది. ఇక భవిష్యత్తులో ఎంత విస్తరించునో!

భక్తకోటికి శ్రీవారి సేవలో ఇప్పటి వరకు (1) శ్రీ దత్త సత్య సాయి అష్టకము (2) శ్రీ దత్త వేదము (3) గురు స్తుతి (4) శివ మహిమ్నః స్తోత్రము (5) శ్రీ దత్త ఉమామహేశ్వర స్తోత్రము (6) భోగ భాగ్య గుళికలు (7) శ్రీ దత్త సూక్తులు (8) శ్రీ దత్తామృతము (9) శ్రీ పాద శ్రీ వల్లభులు (10) శ్రీ నరసింహ సరస్వతి స్వామి (11) శ్రీ మాణిక్య ప్రభువు (12) శ్రీ అక్కలకోట మహారాజ్ (13) శ్రీ సాయి నాథుడు (14) శ్రీ దత్త గురు భగవద్గీత మున్నగు గ్రంథములు అందించి తరించాము.

ఇప్పుడు "మరచిపోకుము దత్తుని మంచి మాట" అను శతకమును సమర్పించుచున్నాము.

ఈ శతకములో శ్రీ దత్తభగవానులు జీవోద్ధరణ కొరకు తాపత్రయము వెలిబుచ్చుచు అక్కడక్కడ "అంట్ల వెధవ" మొదలగు వచనములు ప్రయోగించుట జీవులయొక్క దుర్గుణములకే వర్తించునుగాని జీవులను నిందించుట కాదని మనవి. భక్తమహాశయులు సహృదయముతో స్వీకరించి, పఠించి, ఆనందించి, తరింతురుగాక అని వినతి.

| | |
|---|---|
| విజయవాడ | ఇట్లు |
| వైశాఖ శుద్ధ పంచమి | శ్రీ గురుదత్త భగవానుని సేవలో |
| 20-4-99 | **చిలుకూరు బాలకృష్ణమూర్తి** |
| శంకరజయంతి | **శ్రీమతి భవాని** |
| శ్రీ గురుదత్త | జయ గురు దత్త |

## మరచిపోకుము
# దత్తుని మంచిమాట

సృష్టికర్తను భర్తను సృష్టిహర్త
నేనె నా మూడు ముఖము లీ నిజము తెలుపు
ఒక్కడనె కాన బ్రహ్మంబు ఒక్కటియగు
మరచిపోకుము దత్తుని మంచిమాట 1

తా॥ ఈ సృష్టికి కర్తను, భర్తను, హర్తను నేనే. ఈ సత్యమును నా ఈ మూడు ముఖములు చాటుచున్నవి. నేను ఒక్కడినే. ముగ్గురు కాను. అనగా బ్రహ్మము ఒక్కటేనని తాత్పర్యము.

మూడు పనులను చేయును మూర్తి ఒకటి
బ్రహ్మమని చెప్పు వేదాలు పారజూడ
దీని తెలియక మంత్రాలు దేనికయ్య?
మరచిపోకుము దత్తుని మంచిమాట 2

తా॥ వేదాలన్నీ జగత్తుయొక్క సృష్టి, స్థితి లయములను చేసేది ఒకే ఒక స్వరూపమైన బ్రహ్మము అని ఘోషిస్తున్నాయి. ఇట్లు వేదాలు బ్రహ్మమును గుర్తించు లక్షణమును చెప్పి, ఆ బ్రహ్మము నుపాసించి తరించమని చెప్పుతున్నాయి. ఆ లక్షణము ఏ రూపంలో పూర్తిగా సమన్వయిస్తుందో ఆలోచించక బ్రహ్మమునే గుర్తించలేక, కేవలము వేదమంత్రాలను వృథాగా ఎందుకయ్యా, గొంతు అరిగిపోవునట్లు చదువుచున్నారు?

మూడు ముఖముల ముద్దుల మూట గట్టు
మూర్తి బ్రహ్మంబు సృష్ట్యాది మూడు పనులు
చేయునట్టిదే బ్రహ్మంబు, చెప్పదె శ్రుతి?
మరచిపోకుము దత్తుని మంచిమాట. 3

తా॥ మూడు ముఖాలతో ముద్దులు మూటగట్టు మూర్తియే బ్రహ్మము. సృష్టి-స్థితి-లయములను మూడు పనులను చేయునదే బ్రహ్మమని వేదములు చెప్పుటలేదా?

**మూడు ముఖములు సూచించు మూడుపనుల**
**ఒక్కదేకాన బ్రహ్మంబు నొక్కటెయగు**
**వేదపూర్ణ సమన్వయవేత్త తెలియు**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 4**

తా॥ మూడు ముఖాలూ, సృష్టి-స్థితి-లయములను మూడు పనులను చేయుట సూచించును. ఆయన ఒక్కడేకాన, బ్రహ్మము ఒక్కటే. వేదములు బ్రహ్మమును గురించి చేయు పూర్ణ సమన్వయము తెలిసినవాడే దీనినెరుగును.

**త్రిముఖరూపంబు బ్రహ్మంబు తెలియనరుడు**
**బ్రాహ్మణుడు వాడెచటను సంభవము కాని,**
**బ్రహ్మమును గుర్తుపట్టిన బ్రాహ్మణుడగు**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 5**

తా॥ సృష్టి, స్థితి, లయములను మూడు ముఖములతో చేయు ఏక స్వరూపమైన బ్రహ్మమును గుర్తించిన వాడేకులమునకు చెందినవాడైననూ బ్రాహ్మణుడే అగును. బ్రహ్మమును గుర్తించి బ్రహ్మజ్ఞానమును కలిగినవాడే బ్రాహ్మణుడు గదా.

**వేదశాస్త్రాలు చదివియు వెర్రివారు**
**బ్రహ్మ విష్ణు శివ విభేద భావఖలులు,**
**బ్రహ్మమొక్కటే త్రిముఖంబు పండితునకు**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 6**

తా॥ వేదశాస్త్రములు చదివియును వెర్రివారలై బ్రహ్మ- విష్ణు-శివులలో భేదభావమును కలిగి, దుష్టమతులై కలహించుచున్నారు. పండితునకు మూడు ముఖములతోనున్న బ్రహ్మ మొక్కటే.

బ్రహ్మమును గుర్తుపట్టియు, బ్రహ్మలబ్ధి
పథము తెలిసినవాడె పో బ్రాహ్మణుండు,
విప్రసుతుడైన మాత్రాన విప్రుడగునె?
మరచిపోకుము దత్తుని మంచిమాట. 7

తా॥ బ్రహ్మమును గుర్తుపట్టి, బ్రహ్మమును పొందు మార్గమును తెలిసినవాడే బ్రాహ్మణుడు. అంతే తప్ప బ్రాహ్మణ పుత్రుడైనంత మాత్రాన బ్రాహ్మణుడగునా? కాదు కాదు.

అతిశయంబు గుణాఖ్యమౌ వ్యాకరణము
జ్ఞానమని చెప్ప, జ్ఞానిని జ్ఞానదాత
గురుడు బ్రహ్మంబు, చేతనా స్ఫురణమగునె?
మరచిపోకుము దత్తుని మంచిమాట. 8

తా॥ వ్యాకరణ సంప్రదాయ ప్రకారంగా ఒక గుణము ఎక్కువగా వున్నవానిని ఆ గుణము పేరుతోనే పిలతురు. జ్ఞానదాతయగు ఆ గురుదత్తుడు జ్ఞానాతిశయము కలవాడయినందున, "జ్ఞానము" "ప్రజ్ఞానము" శబ్దములచేత "బ్రహ్మము" అను విశేషణంతో శ్రుతులు చెప్పినవి-బ్రహ్మము అనగా జ్ఞానము. అనగా మహాజ్ఞాని గురుదత్తుడే. లోకంలో జ్ఞానము అనగా చైతన్యము అని అర్థము స్ఫురించదుగదా.

సత్యమైన, అనంతమైన, గొప్పదియగునది జ్ఞానమే అనగా జ్ఞానియే- సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ అని శ్రుతి)

బ్రహ్మనామమే సత్యంబు భక్తులకది
దత్తమయ్యెను దత్తాఖ్య, దానికొరకు
తప్పులై దత్తమని చెప్ప తానె వెలిగె
మరచిపోకుము దత్తుని మంచిమాట. 9

తా॥ బ్రహ్మమే అసలు వేదనామము. ఆ బ్రహ్మము భక్తులకు దత్తమయ్యెను. కాన దత్తనామ మేర్పడినది. బ్రహ్మముకొఱకు తపించినవారు "దత్తం దత్తం" "చిక్కింది చిక్కింది" అని అన్నారు. ఏది? అంటే బ్రహ్మమేనని వారికి అందరికీ తెలియును. కాన, వారినోట దత్తనామమే వచ్చియుండెను. దత్తమంటే చిక్కినది అని అర్థము. ఇది ఒక వస్తువు యొక్క నామము కాజాలదు. బ్రహ్మమే దాని నామము.

("చిక్కినది" అనుమాట ఒక వస్తు నామముకాదు. దత్తం = చిక్కినది, ఏది? అనగా బ్రహ్మమే అని బ్రహ్మము నన్వేషించువారికి తెలియునుకాన బ్రహ్మమని చెప్పబడలేదు.)

**నాల్గువేదాలు కుక్కలై నడచుచుండ,**
**గోవుగా ధర్మదేవతకూడ రాగ,**
**మూడు ముఖముల బ్రహ్మంబు పుడమి తిరుగు,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** 10

తా॥ నాలుగు వేదములు కుక్కలుగాను, ధర్మదేవత రక్షణకోరి గోవుగా వెంటరాగ, మూడు ముఖములతో బ్రహ్మము భూమిపై సంచరించుచున్నది.

**వేదమును నమ్మి బ్రహ్మంబు విదితమైన**
**గుర్తుబట్టుట జ్ఞానంబు మూర్తి నిచట**
**తెలియలేము, తత్త్వము గుర్తుతెలియగలము**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** 11

తా॥ మూడు పనులు చేయు ఒకే స్వరూపము బ్రహ్మమని వేదము చెప్పుచున్నది కాన, వేదమును నమ్మినచో బ్రహ్మమును తెలియగలము. తెలియుట అనగా బ్రహ్మమెవరని గుర్తుపట్టుటయే తప్ప, బ్రహ్మముయొక్క తత్త్వమును తెలియుటకాదు. బ్రహ్మమును గుర్తుబట్టుటయే బ్రహ్మజ్ఞానము కాని బ్రహ్మతత్త్వమును తెలియుట అసంభవము.

**కాల-కర్మ-గుణ విభేదకలనవలన**
**మూడు రూపాలఁ దోచును మూర్తి ఒకటె,**
**మాయచే కనపడును త్రిమూర్తులొకట**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** **12**

తా॥ సృష్టి- స్థితి- లయములను సమయాలలో, ఆ పనులలో ఆ గుణాలతో వున్నప్పుడు ఒకే మూర్తి మూడు రూపాలతో కనబడుతుంది. తన మాయాశక్తిచేత త్రిమూర్తులుగా వేరు వేరుగా ఉన్నట్లు బ్రహ్మము కనపడును. నిజంగా త్రిమూర్తులు లేరు. ఉన్నది ఒకే ఒక దత్త పరబ్రహ్మ మూర్తి అని తెలియవలయును.

**మూడు ముక్కలు కాలేదు, మూడు కాదు,**
**మూడు మూర్తులలోనున్న మూర్తి ఒకడె,**
**మాయ చలన చిత్రములోన మనిషి ఒకడె,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** **13**

తా॥ బ్రహ్మము మూడు ముక్కలు కాలేదు. మూడు బ్రహ్మములూ లేవు. త్రిమూర్తులలోనున్నది ఒక్కమూర్తియే. ఆయన మాయ ఇది. సినిమాలో ఒకే నటుడు ఒకే సమయములో మూడు పాత్రలలోను, ఒకే నటుడు తన ముఖమునే మూడు ముఖాలతోనున్నట్లు కనిపించును గదా!

**నేతి బీరకాయకు లోననేయియున్న**
**బ్రహ్మమును గుర్తుపట్టక బ్రాహ్మణుడగు,**
**మూడు పనులను జేసెడి బ్రహ్మమొకడె,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** **14**

తా॥ "బ్రహ్మము ఎవరు?" గుర్తు తెలియని వాడును బ్రాహ్మణుడే అయినచో, నేతిబీరకాయలో నేయి ఉన్నట్లే. సృష్టి, స్థితి లయములను మూడు పనులను ఒక్కడే అగు బ్రహ్మము చేయుచున్నది.

సురభి రహిత పుష్పము, ఫలశూన్య తరువు
శుష్క సలిల కాసారంబు, శ్రుతులు చెప్ప,
బ్రహ్మమును గుర్తుబట్టని బ్రాహ్మణుండు
మరచిపోకుము దత్తుని మంచిమాట 15

తా॥ వేదములు చెప్పు బ్రహ్మమును గుర్తించని బ్రాహ్మణుడు, వాసనలేని పూవు, ఫలములులేని వృక్షము, నీరులేని చెరువు ఒక్కటే.

మూడు పనులను చేసెడి ముఖము లొప్ప
బ్రహ్మమును తెలిసిన వాడె బ్రాహ్మణుండు
మూడు పోగులు వేయంగ వాడు ద్విజుడె?
మరచిపోకుము దత్తుని మంచిమాట 16

తా॥ జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయములను చేయు మూడు-బ్రహ్మ విష్ణు శివ ముఖములతో వెలుగు బ్రహ్మమును తెలుసుకున్నవాడే బ్రాహ్మణుడు. మూడు జందెము పోగులు వేసినంత మాత్రాన బ్రాహ్మణుడగునా?

బ్రహ్మవేషముల తెలిసి బ్రహ్మసహిత
వేషములఁ బట్టు సర్వదేవేష్టుడగుచు,
వేషి వేషములును చిక్కు విజ్ఞుడగుట,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 17

తా॥ బ్రహ్మమును తెలిసిన జ్ఞాని, సర్వదేవతలూ బ్రహ్మము యొక్క వేషాలని తెలిసి, ఆయా వేషములలోనున్న బ్రహ్మమును పట్టుకొనును. ఇట్టి జ్ఞానికి వేషమూ- వేషము వేసినవాడూ, చిక్కును. అట్టివాడే నిజంగా సర్వదేవతారాధకుడు. వేషములతో సహా బ్రహ్మము వాని[illegible]ధించును.

బ్రహ్మవేషములనుబట్టి బ్రహ్మ మసలు
ఎవరొ గుర్తును తెలియని హీనులకిట
వేషము లెచిక్కెను నటుండు విడిచిపోవ,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 18

తా॥ బ్రహ్మమును తెలియక, బ్రహ్మ వేషములగు సర్వదేవతలను పట్టుకున్నవారు అల్పులు. వారికి చివరకు నటుడైన బ్రహ్మము జారిపోగా, వేషములే చిక్కెను.

రూపవంతుడు ఆత్మ నిరూపణమట
నేను నీవను భావి సన్నిధిని చెప్ప
ఇటు మహావాక్య తాత్పర్య మెరుగవలయు
మరచిపోకుము దత్తుని మంచిమాట. 19

తా॥ ఒక రూపము కలవ్యక్తి, ప్రశస్తమైన వేదాంత జ్ఞానము అతిశయంగా కలవాడు, తాన "అయ మాత్మా బ్రహ్మ" "ప్రజ్ఞానం బ్రహ్మ" అనియు, అతి సమీప భవిష్యత్తులో నేను నీవూ బ్రహ్మము కావలయునని కోరికను సూచించు వర్తమాన ధాతువులతో "అహంబ్రహ్మాస్మి" "తత్త్వమసి" వాక్యాలను తెలియాలి. అనగా చాలా త్వరగా నేను నీవు బ్రహ్మము అవుతాము అని ఇక్కడ వ్యాకరణ సమ్మతమైన అర్థముగా తెలియాలి. ఈ విధంగా నాలుగు మహావాక్యాల తాత్పర్యమును తెలుసుకోవాలి.

శ్రుతియు ప్రజ్ఞాన ఘనుడని చూపునతని
గుణ మహత్త్వార్థ గుణ వాచ్య గుణియెగురువు,
బ్రహ్మమే గురురూపంబు భావమిదియె,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 20

తా॥ "ప్రజ్ఞాన ఘనః" అని శ్రుతి. ప్రజ్ఞానము ఎక్కువగా ఉన్నందున ప్రజ్ఞానఘనుడని శ్రుతి. గుణము ఎక్కువగా ఉన్నప్పుడు గుణి,

గుణశబ్దంతోనే పిలువబడతాడు. ఉదా॥ అధిక తేజస్వి "తేజస్సు" అని పిలువబడుట వ్యాకరణ మతమే. కావున, సృష్టి, స్థితి, లయములు చేయు నది, ప్రశస్తమైన అతిశయించిన వేదాంత జ్ఞానమును బోధచేయు గురు రూపమే బ్రహ్మము. దీని భావము- త్రిమూర్తి ముఖములతో సృష్టి,- స్థితి లయములను చేయుచు అనంత వేదాంత జ్ఞానమును ఉపదేశించి గురు స్వరూపుడగు శ్రీ దత్త భగవానుడే బ్రహ్మమని తేలినది.

**గురువు ప్రజ్ఞాన శబ్దార్ధ భావమగును**
**గుణ మహత్తచే పిలతురు గుణము గుణిగ,**
**చేతనకు రూఢిగాదది చెప్పరతుల,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 21**

తా॥ "ప్రజ్ఞానం బ్రహ్మ" అని శ్రుతి. ప్రజ్ఞానము అనగా ప్రజ్ఞానము కలవాడు. గుణము ఎక్కువగా ఉన్నపుడు గుణ శబ్దంతోనే గుణిని పిలుస్తారు. ప్రజ్ఞానము అనగా ప్రశస్త వేదాంత జ్ఞానమే తప్ప కేవల చైతన్యముకాదు' ప్రజ్ఞానమును చైతన్యమని లోకంలో ఎవరూ పిలుచుట లేదు. కాన ప్రజ్ఞానియే ప్రజ్ఞాన శబ్దంతో పిలువబడును.

**పిలచు తన్వం శుకస్థుని పేరుతోడ,**
**లోహ పేటీస్థుని పిలువ లోహమగును**
**సర్వగతుడా తడును సిద్ధ సాధకులను**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 22**

తా॥ పలుచని గుడ్డలోనున్న వ్యక్తిని వ్యక్తి పేరుతో పిలచెదము. ఇనుపపెట్టెలో వ్యక్తిఉన్నా కనపడడు, కాన పెట్టె పేరుతోనే పిలుస్తాము. ఇట్లు సిద్ధపురుషులందు భగవంతుడు ప్రకాశించును కాన వారిని భగవంతుని పేరుతోనే పిలుస్తారు. సామాన్య జీవులందునూ భగవంతుడున్నాడు. కాని వారి రాజస తామస గుణములవలన కనిపించడు కాన వారిని వారి వారి పేర్లతో నేలుపిస్తారు.

అధముడవతార పురుషుని అధికత(గని
మోసగాడని నిందించి మురియుచుండు,
ఈర్ష్యతో పరతత్త్వంబు నెరుగలేక,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 23

తా॥ అవతార పురుషుని ఆధిక్యమును చూచి అధముడు ఆదివ్య పురుషుని మోసగాడని నిందించి, తన తెలివికి తానే మురిసిపోవును. వాడు ఆ పరమాత్మయొక్క తత్త్వమును ఈర్ష్యవలన తెలియజాలకున్నాడు.

పంచభూతాలు నా సొత్తు పశుధనంబు
జీవులందరు నా సొత్తు నీవు పశువు
పశుపతినినేనె విష్ణువు బ్రహ్మనేనె
మరచిపోకుము దత్తుని మంచిమాట. 24

తా॥ ఈ పంచభూతాలు ఈ జగత్తు అంతా నా సొత్తు. జీవులందరును నా పశుసంపద. నీవును అందులోని ఒక పశువు. నేనే పశుపతిని. నేనే విష్ణువు. నేనే బ్రహ్మము.

గుణము పూజ్యతా హేతువు కులముకాదు
రావణ ఖలుండు వధ్యుడే బ్రాహ్మణుండు,
రాముడ బ్రాహ్మణుండు నారాధ్యుడగును,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 25

తా॥ గుణమువలన పూజ కలుగును కాని కులము వలన కాదు. రావణుడు బ్రాహ్మణుడైనా దుర్గుణుడైనందున వధ్యుడైనాడు. రాముడు బ్రాహ్మణుడు కాకపోయినా, సద్గుణములవలన ఆరాధ్యుడైనాడు.

రాముడన ధర్మము సుఖంబు రమయుతి యన,
రావణుండ ధర్మము దుఃఖ రావకరము,
పండితులు శబ్ద తత్త్వార్థ పరమ విదులు
మరచి పోకుము దత్తుని మంచిమాట. 26

తా॥ రాముడంటే మనిషి కాదు. "రామో విగ్రహవాన్ ధర్మః" అని రామాయణమే, రాముడంటే ధర్మమని చెప్పుతున్నది, రమయతీతి రామః అంటే సుఖింప చేయువాడు రాముడు అనగా ధర్మము సుఖప్రదము. రావణుడు అధర్మము. రావణుడనగా కేకలను పెట్టించు వాడని అర్థము అనగా దుఃఖకరమగు అధర్మమని అర్థము. పండితులు శబ్ద తాత్పర్య పర మార్థ తత్త్వాన్ని తీసుకుంటారు. పామరులు దానిని వినోదకరమైన పాత్రల కథగా తీసుకుంటారు.

**శక్తి వీచికాకృతి సర్ప సరణి శక్తి**
**కుండలిని యన చేతన కుటిల గమన,**
**చిత్త భూతాలు చక్రాలు చిత్ర ఫణితి**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 27**

తా॥ శక్తి తరంగాకారంలో సర్పంలాగా కుటిల మార్గంలో ప్రయాణిస్తుంది. అన్నజాతమైన చైతన్య శక్తియే కుండలిని. పంచభూతాలు మనస్సు కలసి ఆరు చక్రాలు. చక్రాలనగా ఆకర్షణలని, సుడి గుండాల వంటివని అర్థము. నరునిలోని చైతన్యము వాటిలో పడి భ్రమించక దాట వలెనని బొమ్మల రూపంలో బోధించబడినది.

**శివుడు జ్ఞానంబు బుద్ధిలో చేతనయును**
**కలియ ధారణ యగును చక్రాల దాటి,**
**తిక్క-శంకరయ్యలు బొమ్మ తెలియరైరి**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 28**

తా॥ ఇక బుద్ధి అనే సహస్రారంలో నున్న బ్రహ్మజ్ఞానమే శివుడు. చేతన అనగా కుండలిని. ఈ జ్ఞానముతో కలియుటయే ధారణా యోగము. చిత్త-భూత వస్తు ఆకర్షణలను దాటి జ్ఞానమునందు నిలచుటయే యోగము. ఇదే-చక్రాలను కుండలిని దాటి శివునిలో ఐక్య మగుట. దీని అంతరార్థ మును తెలియని తిక్క-శంకరయ్యలు నిజముగా సర్ప రూప కుండలిని,

చక్ర పద్మాలు ఉన్నవని బొమ్మల భ్రమలో పడతారు. సహస్రార మనగా అనేక నిశ్చయాలతో శాఖోప శాఖలుగా నున్న బుద్ధి.

గ్రంథములు వృథ లోక సంగ్రహము లేక
కవులకును పాఠకులకును కాల హరము,
బ్రహ్మ ధర్మ బోధల సాధు ఫలితములగు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 29

తా॥ లోకాన్ని ధర్మంలో నడిపించి, అధర్మం నుండి ముక్తి కావించి, బ్రహ్మమును బోధించే గ్రంథములు మంచివి, సార్థకములు. ఇది లేకున్నచో, అట్టి గ్రంథాలు, కవులకును, పాఠకులకును కాలాన్ని వృథా చేసేవి అగును.

విష్ణు శివ బ్రహ్మ పనులవి విశ్వమందు
కర్మ లేకుండ తత్త్వంబు కలుగునెట్లు?
అగ్ని యగునె కాల్చక స్తోత్ర మగ్నికరమె ?
మరచి పోకుము దత్తుని మంచిమాట. 30

తా॥ ధర్మ రక్షణ విష్ణు కార్యము. అధర్మ ఖండనము రుద్ర కార్యము. జ్ఞానబోధ బ్రహ్మ కార్యము. ఈ మూడు పనులు చేసిననే త్రిమూర్తి స్వరూపసిద్ధి. కర్మవల్లనే వస్తు తత్త్వము సిద్ధించును. దారిన పోవువారి విషయము నాకేందుకని ఉపేక్షించరాదు. నీ దృష్టిలో అధర్మము జరుగుచున్నచో పరుల విషయమని ఉపేక్షించక, ధర్మ స్థాపనము, అధర్మ ఖండనము యథాశక్తి చేయాలి. పరులకు జ్ఞాన బోధ ప్రచారము చేయాలి. కాల్చే కర్మ ఉన్ననే అగ్ని అగునుతప్ప స్తుతి వలన అగ్ని అగునా? అనగా—లోక సంగ్రహములగు ఈ మూడు పనులను చేయకుండా, కేవలము స్తుతించినంత మాత్రమున దైవత్వము రాదు.

ధర్మ రక్షణము, అధర్మ దండనములు
జ్ఞాన బోధ యథాశక్తి మానవలదు,
స్వామి సహకారమున స్వామి సంతసించు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 31

తా॥ యథాశక్తిగా ధర్మ రక్షణ, అధర్మ ఖండనము, జ్ఞాన బోధలను చేయుము. నాకెందుకని ఉపేక్షించకుము. ఈ మూడు స్వామిచేసే కార్యాలు. నీవునూ చేసినచో స్వామికి సహకరింతువు. దానిచేత స్వామి ఎంతయో సంతసించును. ఆ పనులు చేయుట చేత నీకు నిజముగా దైవత్వము వచ్చును.

మూడు పనులతో ఆచారమున గురువుకు
సమత సిద్ధించు వ్యర్థంబు సాధన లిక,
పొగడి కాకాలు పట్టిన పొంగబోడు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 32

తా॥ యథాశక్తిగా ధర్మరక్షణ, అధర్మ ఖండనము, జ్ఞాన బోధ-ఈ మూడు పనులను ఆచరణమున కలవాడు గురు దత్తునితో సమానమగును. అన్య సాధనలన్నియు ఆచరణ హీనములు కాన వ్యర్థములు. స్తుతులచే పొగడి కాకా పట్టినంత మాత్రాన పొంగిపోయే పిచ్చివాడా స్వామి?

స్వార్థ లక్ష్యంబు సిద్ధించ సడలిపోవు
లక్ష్య పరమాత్మ కరణంబు, లక్ష్యమైన
ప్రాప్తి పర్యంత మతడుండు పట్టు తోడ
మరచిపోకుము దత్తుని మంచిమాట. 33

తా॥ ఈనాటి మానవులకు కోరికలే లక్ష్యము. భగవంతుడు వాని సాధనలో పని ముట్టు. లక్ష్యము సిద్ధించగనే, భగవంతుడు, భగవంతునిపై భక్తి, సడలి పోవుచున్నవి. భగవంతుడే లక్ష్యమైనచో, ఆయనను చేరు వరకు భగవంతుడు, భక్తి సడలిపోరు.

**పది తరాల కిచ్చినగాని భక్తుడడుగు,**
**మరల నిమ్మని పశు పక్షులరుగు తిన్న,**
**అడవికేగిరి మునులవి అధిక మనుచు,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** 34

తా॥ పది తరాలకు సరిపడ సొత్తు నిచ్చిననూ, భక్తుడు మరల నిమ్మని వేడుచున్నాడు. పశు పక్షులప్పటికి తిండి నిచ్చిన తృప్తిపడి వెడలి పోవుచున్నవి. కాన నరుల కన్న పశు పక్షులే మేలని, నరులుండు ఊళ్ళని వదలి, పశు పక్షులుండు అడవులే మేలని, మునులు అడవుల నాశ్ర యించినారు.

**వరము లిచ్చిన పూజలు పెరుగుచుండు,**
**దిబ్బలో బడు పటము రాదేని వరము,**
**ముందు ఫలమున్న తుది పూజ మొక్కుబడులు**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** 35

తా॥ పూజలకు వరములు లభించినచో ఆ పూజలు పెరుగుచుండును. వరములు లభించనిచో దేవుడి పటము దిబ్బలోకి పోవును. (కొందరు పటములను దేవాలయములందు విడచి వత్తురు). అసలు ముందు పూజ చేసిన, వరము రానిచో, ఆ పూజ చేయుట వ్యర్థమగునన్న తలంపుతో ముందు వరముల నిచ్చినచో తరువాత పూజలను చేతుమని మొక్కుబడు లను చేయుచున్నారు. ఎంత నీచావస్థ!

**ప్రతి ఫలాపేక్షతో వచ్చు భక్తజనము,**
**భక్తి నమ్మి ప్రతిఫలము బడయువారు,**
**గుడి దుకాణాల పరమాత్మ విడచిపోయె,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** 36

తా॥ గుడికి వచ్చే భక్తులు ప్రతిఫలాన్ని ఆశించి, తమ భక్తిని అమ్ముకొని ప్రతి ఫలాలను పొందుటకు వచ్చిన వారే. ఈ గుడి దుకాణము లను అసహ్యముతో భగవంతుడు విడిచి పోయినాడు.

ఆలయంబుల వ్యాపార మధికమయ్యె
యోగియే నిలువండటు, యోగిరాజు
నిఁచునే అన్య దేశాల నిలుచుగాని,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 37

తా॥ దేవాలయములందు వ్యాపారము ఎక్కువైనది. అట్టి చోటు లందు యోగియే నిలువ జాలడు. ఇక యోగేశ్వరుడు నిలుచునా? అట్టి ఆలయాలను వదలి బయట సర్వత్రా నిలచియున్నాడు.

ప్రతిఫలాపేక్షతో సేయు భజనపూజ
కొంగ జపములు క్రతువులు దొంగ తపము,
ఫలరహిత భక్తి మేలిమి పసిడిబాట
మరచిపోకుము దత్తుని మంచిమాట. 38

తా॥ ప్రతిఫలాలను కోరి చేసే భజనలు, పూజలు, కొంగ జపములు, యజ్ఞాలు- దొంగతపస్సులు, వీరికి ఫలములపై ప్రేమయే తప్ప భగవంతునిపై కాదు. ఫలసాధనకు భగవంతుని ఉపయోగించు దొంగలు. ఎట్టి ఫలాపేక్షలేని నిష్కారణమైన సహజమైన భక్తియే మేలిమి బంగారపు బాటయగును.

సొత్తునిచ్చిన నిత్తురు సొమ్ములనిల
లంచగొండిగ పరునెంచి వంచకులును,
స్వామితత్త్వంబు తెలియని చవటలగుచు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 39

తా॥ భగవంతుడిని లంచగొండిగా భావించి భగవంతునికి ఆభరణములను చేయించి ఐశ్వర్యము నిమ్మని భక్తులు కోరుచున్నారు. స్వార్థరహితమైన భక్తిని స్వామి వశుడగునను స్వామితత్త్వమును తెలియక ఈ జీవులు చవట లగుచున్నారు.

స్వార్థ వేశ్యయును భజించు వగలుచూపి,
భక్తులందరు వేశ్యలే పలుక నిజము,
లేడు నిస్స్వార్థ దాసుండు పుడమికలిని,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 40

తా॥ స్వార్థము నాశించి వేశ్యయును వగలుచూపి భజనచేయును. నిజము చెప్పవలెనన్న ఈ భక్తులందరును వేశ్యలే. స్వార్థరహితంగా స్వామికి సేవచేయువాడీ కలి యందు భూమిలో లేడు.

ప్రతిఫలాపేక్షతో సేయు భక్తి, కర్మ,
జ్ఞాన, యోగాలు హయములు చచ్చినవియె,
ప్రాణిఖరము నిస్స్వార్థంబు పనికివచ్చు
మరచిపోకుము దత్తుని మంచిమాట. 41

తా॥ ప్రతిఫలాన్ని కోరి చేసే భక్తి, యజ్ఞాదికర్మ, జ్ఞానచర్చ, యోగము మొదలగు ఉత్తమ మార్గాలైననూ చచ్చిన గుర్రములవంటివి. పనికిరావు. (గుర్రము ఉత్తమమే) నిస్స్వార్థమైన ఏ పిచ్చిపనియైననూ బ్రతికినట్టి హీనమైన గాడిద వంటిది. అయిననూ భగవంతుని చేరు వాహనముగా పనికివచ్చును.

స్వార్థమే మోక్షకామంబు స్వల్పసుఖద-
వరములను మించి ఆనంద మరయునతడు,
దొంగలకును మించిన గజదొంగ యతడు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 42

తా॥ మోక్షమును కోరుటయు స్వార్థమే. అది పెద్ద స్వార్థము. స్వల్పమైన ఐహిక సుఖములనిచ్చు వరములను వదలి శాశ్వతానందమును ఆతడు కోరుచున్నాడు. అతడు చిన్న దొంగలను మించిన గజదొంగ. కాన మోక్షమును కూడా కోరరాదు.

అష్టసిద్ధుల కీర్తిని ఆశపడుట
స్వామి పదవిని కోరుట సంతసంబె?
భక్తకోటుల దుఃఖాను భవము తెలియ,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 43

తా॥ అష్టసిద్ధులనూ, కీర్తిని ఆశించుట, స్వామి పదవిని కోరుటయే. ఆ పదవి ఆనందకరమని అనుకొనుచున్నాడు. కానీ, స్వామి నిత్యమూ భక్తకోటుల దుఃఖాల ననుభవించుచున్నాడు. ఈ స్వామి తత్త్వమును తెలిసినచో స్వామి పదవిని కోరడు.

కష్టములు రాగ నరుడు నాకాలబడును,
కష్టములఁ దీయ పైచూపు కన్నులగును,
నరుల చరితంబు లతినీచ మరయభువిని,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 44

తా॥ కష్టములు రాగానే, నరుడు నా కాళ్ళపైబడి వేడుకొను చున్నాడు. ఆ కష్టములను తొలగించగనే, వెంటనే, వానికండ్లు క్రింద చూడక అహంకారముతో పైన చూచుచుండును. ఈ భూమిపైన, మానవుల చరిత్రలు పరిశీలించనచో అతి నీచముగనున్నవి.

నిత్యసుఖ నిత్యకష్టంబు నిజము వెగటు,
పచ్చడియు లడ్డు మార్పు సుఖక్షణమగు,
వెగటును రుచిని తెలియని వెర్రివారు!
మరచిపోకుము దత్తుని మంచిమాట. 45

తా॥ ఎల్లప్పుడూ సుఖము, లేక, ఎల్లప్పుడూ కష్టమున్న వెగటు కలుగును. పచ్చడి, లడ్డు మార్చి మార్చి తిన్నచో అది చక్కని భోజన మగును. ఏది వెగటో, ఏది రుచియో కూడ తెలియని ఈ వెర్రిజీవులు నిత్యసుఖముకై నన్ను ప్రార్థింతురు.

**కర్మచక్రము తిరుగు నా కరమునందు**
**కష్ట సుఖముల మార్పుతో కలిపియుంటి**
**బూంది లడ్డులవలె రుచి పూర్ణములగు**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 46**

తా॥ నా చేతిలో కర్మచక్రము సదా భ్రమించుచుండును. జీవుని పాప పుణ్యములను బూంది-లడ్డులవలె మార్చి మార్చి కలిపి, రుచి పూర్తిగ నుండునట్లు ఈ కర్మచక్రమును తయారుచేసియున్నాను.

**వీని రక్షింపమని నీవు వేడుకొనుట**
**హాస్యమగు, వీడు ఈ జన్మనందు తెలియు**
**నీకు, నాకు సృష్ట్యాదిగా నేస్తమితడు,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 47**

తా॥ ఒక జీవుని నాకు చూపించి మరొక జీవుడు రక్షింపమని వేడుకొనుట హాస్యకరము. ఏలనన,-ఈ ఇద్దరి జీవులకు ఈ జన్మలోనే సంబంధము. నాకు సృష్టి జరిగిననుండి జీవులందరును ఆత్మీయులు.

**జీవపశు సంపదనుగల దైవమతడు**
**విశ్వగృహ భర్త యజమాని విదితమగును,**
**వాని ఇచ్ఛయే ధర్మంబు అనుసరింప,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 48**

తా॥ జీవులందరును దైవముయొక్క పశుసంపద. దేవుడే ఈ సృష్టి అను గృహ యజమాని. వాని ఇచ్ఛయే ధర్మశాస్త్రముగా తెలియుచున్నది. అట్టి ధర్మశాస్త్రము ననుసరించవలయునే తప్ప దైవాధీనుడైన జీవునకు స్వాతంత్ర్యములేదు. అనగా ఒక పశువు ఎట్లు యజమాని ఇచ్ఛలో నుండునో జీవులందరును పశుపతియగు సర్వేశ్వరుని ఇచ్ఛారూపమైన ధర్మశాస్త్రము ననుసరించి ఉండవలయునే తప్ప స్వతంత్రించరాదు.

**పులుపు కారము లుప్పులు తిలభవములు**
**రోగదములు, తగ్గించ నారోగ్యవృద్ధి,**
**జిహ్వాగుహ్య చాపల్యము చెడుపథములు,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 49**

తా॥ పులుపు, కారము, ఉప్పు, నూనెలు మొదలగు రోగకరము లగు పదార్థముల నెంత తగ్గించిన అంత ఆరోగ్యము వృద్ధియగును. దాని వలన దైవానుగ్రహసాధన చక్కగా జరుగును. మానవుని చెడగొట్టుదారులు రెండే రెండు- ఒకటి జిహ్వాచాపల్యము రెండవది గుహ్యచాపల్యము. ఈ రెండింటిని నిగ్రహించిన సాధన త్వరగా సిద్ధించును.

**మద్య ధూమపానములు దుర్మార్గములగు,**
**రోగకరములు సాధన ఆగిపోవు,**
**సీసమును త్రాగ గలవారి చేతవేరు,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట 50**

తా॥ మద్యపానము, ధూమపానము- రెండూ దుష్ట మార్గములు. వీటి వలన రోగము వచ్చును. దాని వలన భగవదనుగ్రహమును సాధించు సాధన ఆగిపోవును. సిద్ధపురుషులు కొందరు మద్య-ధూమపానములను చేతురు. వారిని అనుకరించరాదు. వారు కరిగిన సీసమును కూడ త్రాగ గల యోగశక్తి కలవారు. వారి చేతలలో అంతరార్థము వేరుగనుండును.

**సుఖము మద్య మహంకార శుష్కుడగును,**
**కష్టములు తిక్త గుళికలు కలుగు బలము,**
**కష్టములఁ గోరె కుంతి సద్గతినిఁబడయ,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 51**

తా॥ సుఖములు సారాయి వంటివి. వాటివలన అహంకారము పెరిగి మానవుడు శుష్కించిపోవును. కష్టాలు చేదుమాత్రలు, వాటివలన జ్ఞాన

బలము పెరుగును. సద్గతిని పొందగోరిన కుంతి, కష్టములనే కోరినది గదా!

**ఔత్సుక్యోద్రేక మతిరోగ మౌను వాని**
**పెంచు చలచిత్రముల జూడ పిచ్చిగాదె?**
**ఇచట వద్దని అచ్చట నేలమరల?**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 52**

తా॥ ఏమి జరుగునో? అను ఔత్సుక్యము, ఉద్రేకములు- రోగములను పెంచునని వైద్యులు చెప్పుదురు. వీటిని పెంచు సినిమాలను చూచుట పిచ్చిగాదా? జీవితములో ఔత్సుక్యమును, ఉద్రేకమును ఇష్టపడడు. ఇవి లేనపుడే శాంతి సుఖములుండును. మరి వీటినే సినిమాలలో చూచి పొందాలని ఇష్టపడుచున్నాడు జీవుడు! ఇది నిజముగా పిచ్చికాదా?

**హర్షశోక ప్రకంపంబులామయములు,**
**అవియె భగవత్పరములైన అమృతములగు,**
**చలన చిత్రాలబడి వృథ చావనేల?**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 53**

తా॥ సంతోష-శోకముల వలన గలుగు ఉద్రేకములు మహారోగ కారణములని వైద్యశాస్త్రముల నిర్ణయము. అయితే, ఈ సంతోష శోకాలే భగవంతుడి విషయంలో భక్తిలో కలిగితే అవియే అమృతములగును. ఎంత మాత్రమూ ఆరోగ్య భంగకరములు కావు. సంతోష- శోక- ఉద్రేకాలే నీ కిష్టమైనచో భక్తిలో పొంది తరించుము. వృథాగా సినిమాలలో వాటిని పొంది ఆరోగ్యమును చెడగొట్టుకొని చావనేల?

**టీ.వి, సినిమాలు, ముచ్చట్లు, డిత్త కథల**
**పుస్తకంబులు, తపముల నస్తమింప**
**జేయ వచ్చిన రంభాది చిత్రకృతులు**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 54**

తా॥ టీ. వీ. లు, సినిమాలు, అనవసరమైన ముచ్చట్లు, వ్యర్థ కథలతో కూడిన పుస్తకాలు- ఇవే తపస్సును పాడుచేయుటకు భూమిపై కలిలో వచ్చిన రంభ, మేనక, ఊర్వశి, తిలోత్తమ మొ॥ అప్సరసలు చిత్ర చిత్ర రూపాలతో ఉన్నారు.

పరుల సొత్తు కాజేసి లాభంబు దలచు
కాని మూలధనములును కరిగిపోవు,
మోసగించిన వాడెపో మూర్ఖుడయ్యె,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 55

తా॥ పరుల ధనములను అపహరించి, తాను లాభమును పొందెనని మూర్ఖుడు తలచును, వాడు మూర్ఖుడు. ఏలననగా ఆ పరుల ధనము వాని మూలధనమును కూడ నాశనము చేయును, కాన అట్టివాడు బుద్ధిమంతుడు కాడు. సత్యము తెలియని పరమమూర్ఖుడే అగును.

పరుల సొమ్ముల భార్యలఁ బడయనేల?
ఆత్మనుపమాన మనుకొన్న అర్థమగును
నీకు సృష్టించితినిగదా నియతి రెండు
మరచిపోకుము దత్తుని మంచిమాట. 56

తా॥ పరుల భార్యలను, పరుల ధనముల నేల పొందగోరెదవు? నీ భార్యను, నీ ధనమును పరులు పొందగోరిన నీకెంత బాధయో, అంతే బాధ పరులకుండును గదా!- నీకు భార్యను, కావలసిన ధనమును నేను సృష్టించి, లోక నియమానుసారంగా నీకు యిచ్చినాను గదా!

ధనము ధన మంచు నిత్యంబు దాహమేల?
వెంట జనునె నరకమందు విలువ గలదె?
రక్షసేయునే శిక్షల పక్షి వెధవ!
మరచిపోకుము దత్తుని మంచిమాట. 57

తా॥ నిత్యము ధనము ధనము అంచు ఈ దాహమెందులకు? ధనము నీ వెంట వచ్చునా? ధనమునకు నరకమున విలువ గలదా? నీకు పడు శిక్షల నుండి ఈ ధనము నీకు రక్షణము నిచ్చునా? ఓ పక్షి వెధవా! తెలుసుకో.

**గుడ్డిమోహముతో నొక కుంక కొరకు**
**పాపములఁజేతువా? పాప భాగమతడు**
**అణువు భోగించడచ్చట అంట్ల వెధవ!**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 58**

తా॥ గుడ్డి వ్యామోహంతో ఒక కుంకకోసము నీవు అనేక పాపము లను చేయుచున్నావా! నీ పాప భాగములోని ఒక అణువు శిక్షను కూడా ఆ కుంక నరకములో అనుభవించదని ఓ అంట్ల వెధవా! తెలుసుకొనుము.

**భార్యపిల్లలకై ధనపాపములను**
**చేయుచుందురు నరకంబు చేరినపుడు**
**వారె గుర్తింపరాతడే పరమకుంక,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 59**

తా॥ భార్యా పిల్లలకై ధనార్జనలో అనేక పాపాలను చేస్తారు. వారే నరకమున పడినపుడు ఆ భార్యా పిల్లలే అచట వానిని గుర్తించరు! ఇట్టి ఈ అజ్ఞానియే పరమకుంక అనబడును.

**పరుల భార్యల సోదరీ భావమునను**
**పరుల సొమ్ముల విషముగా పారజూడ,**
**సారమిదియె రామాయణ భారతముల**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 60**

తా॥ అన్యుల భార్యల సోదరీ భావంతోనూ, అన్యుల సొత్తును విషముగాను చూచుటయే రామాయణ భారత గ్రంతముల సారము.

మేటి కర్తవ్యములజేసి మిగులు సమయ
మందు భగవదర్చన సేయనరయుసిద్ధి,
అపుడు వ్యర్థవ్యసనముల నరిగిచెడును
మరచిపోకుము దత్తుని మంచిమాట. 61

తా॥ కర్తవ్యములు చేసుకుంటూ, ఖాళీగా ఉన్న సమయమునందు భగవంతుని అర్చించిన చాలును. తప్పక సిద్ధిని పొందును. ఖాళీగా ఉన్న సమయము అందు టి.వి మొ॥ వృధా వ్యసనముల పాలైనచో చెడును.

ఇచట సాయపడును గురువెంతగానో
సాయపడడట బోధించ సాయపడును,
సాయపడడు పరీక్షలో చాల కోపి,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 62

తా॥ ఈ లోకంలో సాధనలో నీకు భగవంతుడెంతగానో సాయ పడును. ఆ లోకంలో నీ కర్మ ఫలాలను పరీక్షించి తీర్పు యిచ్చునపుడు ఏ సాయము చేయక కోపముతో నుండును. గురువు బోధించునపుడేమి అడిగినా చెప్పును. పరీక్ష సమయంలో మాత్రం అడిగితే కోపించును.

నేను లేనంట! విశ్వంబు నిలచునంట!
స్వయముగ తనకుతానె నీ బంధము లిటు
వాగుచుందురు నాస్తిక వ్రాత్యులపని
మరచిపోకుము దత్తుని మంచిమాట. 63

తా॥ ఈ లోకంలో పతితులైన నాస్తికులు నేను లేననియూ, జగత్తు తనకుతానే స్వయంగా ఏ ఆధారమూ లేకుండా నిలచుననియూ వాగు చుందురు.

మహిమఁ జూపిన గారడి మనిషి యనుచు
ఈర్ష్యతోఁ జచ్చు నాస్తికునే మనందు?
పరులగొప్ప సహింపడు పాడు మనిషి
మరచిపోకుము దత్తుని మంచిమాట. 64

తా॥ నేను మహిమలను చూపిననూ నన్ను గారడిచేయు ఇంద్ర జాలికుడని ఈర్ష్యతో నాస్తికులు ఏడ్చి చూస్తూ ఉంటారు. వారిని ఏమని అందును? ఈ పాడు మానవుడు ఎప్పటికి పరుల గొప్ప తనమును ఓర్వ జాలడు. అందుకే భగవంతుని గొప్ప తనమును ఈర్ష్యతో సహించ లేకున్నాడు.

ముండమోపులు కొందరు బండనెక్కి
ఇనుడు లేడని తీర్మానమును సలుపగ,
సూర్యకాంతిలో నణువైన శూన్యమగునె?
మరచిపోకుము దత్తుని మంచిమాట. 65

తా॥ కొందరు ముండమోపులు రచ్చబండనెక్కి, సూర్యుడు లేడని తీర్మానము చేసినంత మాత్రాన సూర్యకాంతిలో అణువుకూడా తగ్గదు కదా. అట్లే నాస్తికుల తీర్మానముల వలన నా మహిమ అణువు కూడా తరగదు.

దేవుడన పిచ్చివానిగా భావముందు
మ్రొక్కి వరముల గొనిపోవ మోసగాండ్రు,
అతడి ప్రజ్ఞకు నంతంబు నరయలేరు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 66

తా॥ దేవుడంటే ఏదో ఒక పిచ్చివాడనుకుంటారు. మోసగాండ్రు అయిన జీవులు మ్రొక్కి వరములను పొందాలని అనుకుంటారు. కానీ ఆయనయొక్క తెలివితేటలు అంతములేవని తెలియలేరు.

పిచ్చి బిచ్చగానిగ నేను వచ్చుచుందు
నాకు పెట్టిన భిక్ష అనంతమగును
అతడు ప్రతి జన్మ నన్నంబు నందుకొనును
మరచిపోకుము దత్తుని మంచిమాట. 67

తా॥ పిచ్చివాడగు బిచ్చగానిగా నేను వచ్చుచుందును. నాకు పెట్టిన భిక్ష అనంతమగును. దాని ఫలముగా, భిక్ష పెట్టినవాడు, ప్రతి జన్మలోను నా నుండి అన్నమును పొందుచున్నాడు.

జ్ఞానబోధను జేయంగ నే నవనికి
వచ్చితిని చిత్రరూపాల వదరుచుంటు,
తెలియతరమె మునులకును దేవతలకు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 68

తా॥ జ్ఞాన బోధలను చేయుటకు నేనీ భూమికి అనేక విచిత్ర రూపాలలో వచ్చియున్నాను. పిచ్చివాడిగ, పిచ్చి పిచ్చి మాటలు వాగు చున్నందున నన్ను పిచ్చివాడని భ్రమపడి ఋషులు దేవతలు కూడ నన్ను గుర్తించజాలరు. ఇక మనుష్యులకు నన్ను గుర్తించ తరమగునా?

ధనము నాదిరా, నీవును ధనమె పశువు,
ధర్మబుద్ధితో బ్రతుకుము ధర్మమొకటె,
వెంట జనురక్షసేయును వెర్రి వెధవ!
మరచిపోకుము దత్తుని మంచిమాట. 69

తా॥ ఈ ధనమంతయును నాదిరా. నీవును నా పశు సంపదలోని ఒక పశువు కాన. నీవునూ, నాధనమే కదా. ధర్మబుద్ధితో బ్రతుకుము ఓ వెర్రి వెధవా! ఒక్క ధర్మమే వెంటవచ్చి, అచ్చట నిన్ను రక్షించును.

గొఱ్ఱె తనను పెంచినవాని కూడ జనును
తల్లితండ్రిగ భావించి దానిఁ జంపి
మాంసమును తినువాని నేమందుఖలుని?
మరచిపోకుము దత్తుని మంచిమాట 70

తా॥ గొఱ్ఱె తనను పెంచినవానిని తల్లితండ్రిగా భావించి వాని వెంట పోవును. దానిని చంపి దాని మాంసమును తిను దుష్టుని ఏమందును?

కత్తితో కోయ క్రూరుండు కుత్తుకనిట
మౌన వేదనతో కొట్టుకొనుచుచచ్చు,
మాంస శబ్దార్థముఁ దెలిసి మానుకొనుడు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 71

తా॥ దుర్మార్గుడు పశువుయొక్క గొంతును కత్తితో కోయగా, మౌనవేదనతో అరవలేక, ఆ పశువు కొట్టుకొనుచు చచ్చును. మాంస శబ్దమునకు అర్థము తెలుసుకొని మాంసాహారము మానుకొనండి. వచ్చే జన్మలో చంపు వాడును అట్లే చచ్చునని మాంస శబ్దతాత్పర్యము మున్నది.

ఎన్నిపంటల ఫలముల నిచ్చియుంటి
ఎన్ని రుచుల నేర్పరచితి నిష్టములగు
పెంచి జీవుని తిన్న దుర్వంచకుడగు
మరచిపోకుము దత్తుని మంచిమాట. 72

తా॥ ఎన్ని పంటలను, ఫలాలను సృష్టించితిని? ఇష్టములగు ఎన్ని రుచులను సృష్టించితిని? వీటితో తృప్తిపడక పెంచిన జీవుని తినే దుష్ట వంచకుని గురించి ఏమని చెప్పుదును?

**నాల్గు వర్ణాశ్రమాలకు నడిమిబొడ్డు**
**బ్రహ్మమును జేర నాలుగుపథము లొప్పు**
**ఈర్ష్యతో నడ్డదారుల నేగతరమె?**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 73**

తా॥ నాలుగు కులాలకు, నాలుగు ఆశ్రమాలకు, వారి వారి అనుకూలతనుబట్టి బ్రహ్మము అను కూడలికి చేరుటకు నాలుగు మార్గము లున్నవి. ఈర్ష్యతో ఒకదారి వారు అడ్డంగా నడచి వేరు దారికి రా బని లేదు. ఈర్ష్యతో ఎవడూ బ్రహ్మమును పొందలేడు కాన వానికి సిద్ధి రాదు.

**అగ్రవర్ణ పురుషగర్వ మసలుతప్పు**
**ఈర్ష్యయు నఘమె పరులకు ఏదియైన**
**నరకమె పరశువు నసియు నరుక సమమె**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 74**

తా॥ అగ్రవర్ణాలకు అంత్యవర్ణాల పైనను, పురుషులకు స్త్రీల పైనను అహంకారము చూపుట అసలు తప్పు. ఇక అంత్యవర్ణాలకు అగ్రవర్ణాల పైన, స్త్రీలకు పురుషుల పైన ఈర్ష్యయుండుటయును పాపమే. అహంకారమూ, ఈర్ష్య రెండూ నరకానికి దారులే. నరకటానికి గొడ్డలి అయిననేమి? ఖడ్గమైననేమి?

**వంచకుడు నష్టమును పొందు, వంచితుండు**
**సిరిని పొందగ వంచన చెదరిపోయె,**
**చూచువానిని చూచుచు చూడుమిచట**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 75**

తా॥ మోసగించబడినవాడు ఐశ్వర్యమును పొందును. మోసగించిన వాడు మొత్తమును కోల్పోవును. కాన మోసమెపుడును నిలువజాలదు. ఇక్కడ నీవు దేనిని చూచినా, నీ చూపును చూచుచున్న దైవాన్ని చూడుము.

వంచన జయంబు క్షణికంబు వాడెపడును
ఎత్తునుండి ఎత్తులకు పై ఎత్తువేయ
కలడు పరమాత్మ మూఢులు కాంచలేరు
మరచిపోకుము దత్తుని మంచిమాట. 76

తా॥ మోసముతో జయించుట క్షణికము. మోసంతో వృద్ధి చెందినవాడు చాలా ఎత్తునుండి పడును. జీవుని ఎత్తులకు పై ఎత్తువేయు పరమాత్మను మూర్ఖులు చూడలేనందున, ఎత్తులు వేయుచు పరులను మోసగించుచున్నారు.

మోసగించినవానిని ముంచివేతు,
మోసగించబడినవాని మోయుచుండు,
ధర్మరక్షకుడను నేనె ధరణిలోన,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 77

తా॥ మోసగించిన వానిని ముంచి వేస్తాను. మోసగించబడిన వానిని ఉద్ధరిస్తాను. యీ భూమిలో నేనే ధర్మ రక్షణ చేయు వాడను.

వంచకుడు రావణుండు నిర్వంశుడయ్యె
ధార్తరాష్ట్రుడు నష్టుయ్యె ధూర్త ఖలుడు
ప్రతి నిమిష మిలనే నుందు పారఁ జూతు
మరచిపోకుము దత్తుని మంచిమాట 78

తా॥ మోసగాడైన రావణుడు, దుర్మార్గుడగు దుర్యోధనుడును వంశంతో సహా నాశము చెందిరి. నేను ప్రతి నిమిషము ఈ భూమిపై నుండి అంతా కనిపెట్టియే ఉంటాను.

పరుల పంచ్చన హింసయు నరక గతులు,
ఇచట వంచింపబడుదువు హింస నచట
హొందెదవు, వాటి వర్జింప పుణ్య సుఖము,
మరచిపోకుము దత్తుని మంచిమాట 79

తా॥ ఇతరులను మోసగించుట, ఇతరులను హింసించుట నరకానికి మార్గాలు. ప్రతిఫలంగా ఇచట భగవంతునిచేత వంచింపబడుతావు. అచట హింసింప బడుదువు. ఈ రెండింటిని వదలినచో నీకు పుణ్యము వలన లభించు సుఖము కలుగును.

అన్న సొమ్మును కాజేసి అంతరించె
ధార్తరాష్ట్రుడు భరతుండు త్యాగికాన
సుఖపడెను వంశవృద్ధితో సూక్ష్మమదియె
మరచిపోకుము దత్తుని మంచిమాట 80

తా॥ అన్న సొమ్మును కాజేసిన దుర్యోధనుడు వంశంతో సహా నాశనమయ్యెను. కానీ అదే అన్న సొమ్మును భరతుడు అంగీకరించలేదు. కాన భరతుడు తన వంశము వృద్ధిచెంద సుఖపడెను. రామాయణ భారత గ్రంథములలోని సూక్ష్మమైన అర్థమును గ్రహించవలయును.

పాపి శిక్షించబడువాని పాపమెల్ల
అనుభవింతురు అది చూచి అలమటిల్లు,
వంశ నాశాంత రావణ వధయు జరిగె,
మరచిపోకుము దత్తుని మంచిమాట 81

తా॥ పాపి శిక్ష ననుభవించుటయే కాక, వాని బిడ్డలును ఆ శిక్ష ననుభవింతురు. దానిని ఆ పాపి చూచి వేదన చెందుటయు వాని శిక్షలోని భాగమే. వంశ నాశమును చూచిన తరువాతనే రావణ దుర్యోధనాదులు బాధ ననుభవించి నశించిరి.

తప్పు సంగీకరింపడు తన కృతంబె
ధర్మమని చెప్పు పదిమంది తన్ను చేరి
పొగడగా దురహంకార పూర్ణుడగుచు,
మరచిపోకుము దత్తుని మంచిమాట 82

తా॥ దుష్టుడు తన తప్పును అంగీకరించడు. తాను చేసినదే ధర్మమని వాదించును. పదిమంది మూర్ఖులు తనను చేరి పొగడగా, దురహంకారముతో నిండిపోవును.

దుష్టులును స్వామి బిడ్డలే దుష్ట గుణము
దిద్దుకొను సమయంబు ఆ దేవుడిచ్చు
తుదకు శిక్షించు మూర్ఖుల తొందరేల?
మరచిపోకుము దత్తుని మంచిమాట 83

తా॥ దుర్మార్గులు కూడ దేవుని బిడ్డలే కాన, వారి దుర్గుణాలను దిద్దుకునే అవకాశము నిచ్చును. దిద్దుకొనని వారిని చివరకు మొండివారని నిశ్చయించి శిక్షించును. తొందరపడనేల?

తప్పు రూపించ నా స్వేచ్ఛ దారి యనును,
జీవుడెప్పుడు నియతుండు దైవవశుడు,
వాని సొత్తు యీ విశ్వంబు వాడె భర్త,
మరచిపోకుము దత్తుని మంచిమాట 84

తా॥ దుష్టుని తప్పులను నిరూపించినపుడు, అప్పుడూ తప్పులను అంగీకరించక, నా స్వేచ్ఛ ఇది అనును. కాని జీవుడు దైవ శాసితుడు. ఈ విశ్వమంతయును దైవము సొమ్ము. దైవమే సర్వభర్త. జీవుడు స్వతంత్రుడు కాడు. దైవాధీనుడే.

3)

తానె సర్వజ్ఞుడని తన తప్పులన్ని
ధర్మములుగ వాదించు దుష్కర్మ ఖలుడు,
పాప నిర్ణేత పరమాత్మ ఫలదు డతడు
మరచిపోకుము దత్తుని మంచిమాట 85

తా॥ దుర్మార్గుడు తానే సర్వజ్ఞుడననుచు, తన పాప కర్మము లన్నియు ధర్మములని వాదించును. వాని కర్మములు పాపములా? కావా? అని వాటినిర్ణయించి ఫలాలనిచ్చే పరమాత్మ ఉన్నాడు.

దిద్దుకొన గలిగిన తప్పు దిద్దుకొన్న
దిద్దు కొనలేని తప్పులు రద్దు అగును,
భాగమిచ్చిన రారాజు బాగుపడడె?
మరచిపోకుము దత్తుని మంచిమాట. 86

తా॥ దిద్దుకోటానికి వీలుగా ఉన్న తప్పులను దిద్దుకొన్నచో, దిద్దు కోటానికి వీలులేని తప్పులు కూడా భగవంతునిచే క్షమించబడును. దుర్యోధనుడు పాండవుల కెన్నో ద్రోహాలు చేశాడు. అవి దిద్దుకోలేని తప్పులు. వారి రాజ్య భాగం వారి కిచ్చుట దిద్దుకొన గలిగిన తప్పు. అది యిస్తే మిగిలిన తప్పులు కూడా క్షమించబడి సుఖంగా బ్రతికే వాడు గదా.

దిద్దుకొన సాధ్యమౌ తప్పు దిద్దుకొనిన
పాపమంత శమించును పాపియతడు,
సీత నిచ్చిన చాలును చెడుట తప్పు!
మరచిపోకుము దత్తుని మంచిమాట. 87

తా॥ దిద్దుకోటానికి వీలుగా నున్న తప్పులను దిద్దుకుంటే చాలును. దిద్దుకోటానికి వీలులేని తప్పులు కూడ క్షమించబడును. రావణుడు ఎన్నో పాపాలు చేశాడు. అవి దిద్దుకోటానికి వీలుకాని హత్యలు, పరస్త్రీ-మానభంగాలు. అయినా, సీతను తిరిగి యిస్తే ఆ పాపాలన్నీ క్షమించబడి బాగుండేవాడు గదా.

**ధర్మజుడు క్షమించినను అధముని భ్రమించె**
**క్షమను చేయజాలరు నరులమలురయ్యు,**
**ఆతడే అధికారి, అయ్యదియె పథము**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 88**

తా॥ దుర్యోధనుడు తన తప్పులను దిద్దుకొన నిరాకరించెను. అయిననూ దుర్యోధనుని క్షమించి ధర్మరాజు రాజ్యముగు విడనాడఁ దల చెను. అయితే భగవానుదందులకు అంగీకరించలేదు. దుర్యోధనుని సకుంటుంబముగ సర్వ నాశనము చేసెను. కావున, పాప క్షమాపణాధి కారము మానవులకులేదు. పాప క్షమాపణమును చేయు అధికారము ఒక్క భగవంతునకే కలదు. ఆ భగవంతుడు పాప క్షమాపణమును ఎట్లు చేయు ననగా దానికి ఒకే ఒక మార్గము. పాపమును అంగీకరించి మరల ఆచ రింప కుండుటయే.

**నిర్ణయానుగ్రహములను నిగ్రహమును**
**బ్రహ్మ విష్ణు శివ వదన పరములగును**
**దిద్దుకొనిన క్షమించును దివ్యపథము**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 89**

తా॥ బ్రహ్మ స్వరూప ముఖముతో పాప-పుణ్య నిర్ణయము, విష్ణు ముఖముతో పుణ్యాత్ములను అనుగ్రహించుట, రుద్ర ముఖముతో పాపాత్ము లను నిగ్రహించుట, ఈ మూడు పనులను పరమాత్మ - పరబ్రహ్మ స్వరూపముగు శ్రీ దత్త దేవుడే చేయును. పాపమును తెలుసుకొని, పీడ న్నచో దిద్దుకొనిన, మరల దానిని ఆచరించని యెడల, ఆ పాపము క్షమించబడి శ్రీ-దత్త దేవుడనుగ్రహించును. ఇది ఒక్కటియే దివ్యమైన మార్గము. (బ్రహ్మ స్వరూపం కృత నిర్ణయాయ, రుద్ర స్వరూపం ఖల నిగ్రహాయ, విష్ణు స్వరూపం సదనుగ్రహాయ, తస్మై నమస్తే త్రిగు ణాత్మకాయ.)

**పాప రహిత దేవత, మారుపాపి నరుడు,**
**తెలిసి పాపి దైత్యుండు, ఆ తెలివి లేని**
**పాపి పశువు, దైత్య సురులు పరగ నరులె,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** **90**

తా॥ ఏ పాపమూ చేయని వారు దేవతలు. పాపము చేసి తెలుసుకొని దిద్దుకొనువాడు నరుడు. పాపము చేసి, తెలిసియు, దిద్దుకొనని అహంకారులే రాక్షసులు. పాపము చేసి తెలియని పశువులు వేరుగా వేరు రూపాలతో కనబడుచున్నవి. ఇక, కనిపించని, దేవతలు, రాక్షసులు, మనుజులలోనే ఉన్నారు.

**బ్రహ్మశాసన ధర్మంబు భంగపరచి**
**బ్రహ్మసంప్రీతి రాదు ఏ పద్ధతులను**
**ధర్మమును తప్ప బ్రహ్మంబు దరికిరాదు**
**మరచిపోకుము దత్తుని మంచిమాట** **91**

తా॥ ధర్మశాస్త్రము బ్రహ్మముయొక్క శాసనమైన వేదము. మన్వాది ధర్మశాస్త్రములన్నియును వేదోదితములు. అట్టి ధర్మమునుతప్పి, బ్రహ్మమును జపదాన యజ్ఞాది మార్గములలో దేనిచేతనూ ప్రీతినొందించలేము. ధర్మము తప్పినవాని సమీపమునకు కూడా బ్రహ్మము రాదు. ఇక బ్రహ్మ సామ్రాజ్యమును గురించి చెప్పబనిలేదు.)

**పాపి సుతులను పొందిరి ప్రాక్కృతముల**
**కర్మ చేసినవానికే కలుగు ఫలము,**
**అతడి పాలనలోన అన్యాయమగునె?**
**మరచిపోకుము దత్తుని మంచిమాట.** **92**

తా॥ పాపియొక్క బిడ్డలు నిష్కారణంగా తల్లిదండ్రుల మూలంగా పాపఫలాలను అనుభవించుట అన్యాయముకదా! అని అనుకుంటారు. కానీ

ఆ దేవుడి పాలనలో అన్యాయము జరుగునా? ఆ పాపియొక్క బిడ్డలుకూడ వారి వారి పూర్వజన్మల పాపఫలాలను అనుభవించిరని తెలియవలయును.

ధర్మమునుతప్పి జ్ఞానియై తపముసేయ
శిక్ష తప్పునే ఎంతటి సిద్ధునకును?
రావణుని భక్తి జ్ఞానంబు రక్షయగునె?
మరచిపోకుము దత్తుని మంచిమాట. 93

తా॥ ఎంత పండితుడైనా తపస్వి అయినా సిద్ధుడైనా ధర్మమును తప్పినచో శిక్షతప్పదు. రావణుని భక్తిజ్ఞానాదులు వాని శిక్షనుండి వానిని తప్పించి రక్షణము చేయగాలిగవా? లేవు. లేదు.

పశువు మన్నించబడు, దైత్యు(బట్టి చీల్చు,
తెలిసినట్టి మూర్ఖుడు కాస తీవ్రశిక్ష,
దిద్దుకొన గోటితో బోవువద్దు తపము,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 94

తా॥ తెలియని పశువును భగవంతుడు క్షమించునుకాని తెలిసి పాపముచేయు దురహంకార మూర్ఖుడగు రాక్షసునిపట్టి చీల్చి తీవ్రశిక్షను వేయును! దిద్దుకొని పాపమును గోటితో పోగొట్టుకొనక పాపములను పోగొట్టనేని తపస్సు చేయనేల?

ధర్మమెపుడు వృద్ధియగు అధర్మమెపుడు
నాశమొందును యుగయుగ న్యాయమిదియె
భగవదాజ్ఞయే ఇది బాధపడగనేల?
మరచిపోకుము దత్తుని మంచిమాట. 95

తా॥ ధర్మమెల్లప్పుడును వృద్ధిచెందును. అధర్మము నాశనమగును. ప్రతి యుగంలోను ఈ న్యాయము జరుగుతుంది. ఇది భగవంతుని ఆజ్ఞ కాన అనవసరంగా బాధపడ నవసరము లేదు.

యముని శిక్ష మార్కండేయునందు వేరు,
ఇష్టమైన సావిత్రికి నిచ్చెనతడు,
ధర్మ పక్షపాతముఁ జూప తప్పుగాదె?
మరచిపోకుము దత్తుని మంచిమాట. 96

తా॥ మరి, ధర్మనిర్వహణము చేసిన యముని శిక్షించితి నేలయన్న అచట సూక్ష్మమున్నది. సావిత్రి విషయములో యముడు స్వతంత్రించి, భర్త ప్రాణముల నిచ్చెను. అచట ధర్మమును తప్పి, నా భక్తుడగు మార్కండేయుని విషయములో కర్తవ్యములో పట్టుపట్టుట తప్పుగదా? అంటే తనకిష్టమైనచో ధర్మము తప్పవచ్చునా? (సావిత్రి విషయములో) ఇష్టము కానిచో కర్తవ్య ధర్మమును ఆచరించ వలయునను సాకు చూపవచ్చునా? (మార్కండేయుని విషయములో).

కర్మఫలములు తప్పవు కాలునకును,
స్వేచ్ఛతో పాపమునుఁ జేయ శిక్షనొందె,
శివుడ నేనె మార్కండేయు డవతరించె,
మరచిపోకుము దత్తుని మంచిమాట 97

తా॥ యమునికి కూడ కర్మఫలములు తప్పలేదు. సావిత్రికి స్వతంత్రించి ప్రాణదానంచేసి, మార్కండేయుని విషయమున పట్టుబట్టగా శిక్షింపబడెను. యముని శిక్షించుటకే శివుడనైన నేను మార్కండేయునిగా అవతరించాను. కర్మఫలము ననుభవించ వలయునన్న పట్టుదల ధర్మదేవునికి, మార్కండేయ విషయమున కలిగినది. అందువల్లనే, ముందు తన కర్మఫలమును తాననుభవించుటయు, తన పట్టుదలవల్లనే జరిగినది.

నాటినుండి కర్మఫలము నరుడు పొందు
భక్తఫలముల నేననుభవము నొంద
ఒప్పుకొంటిమి అన్యోన్య మొప్పుదచట,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 98

తా॥ ఆ సమయంలో నేనూ, ధర్మదేవుడూ ఒక ఒప్పందమును కుదిరించుకొంటిమి. ఏ జీవుడైనా కర్మఫలములను అనుభవించవలసినదే కాన నేను ఆ నియమమునకు అడ్డురాను. అయితే, నా భక్తాగ్రేసరుల పాపకర్మల ఫలాలను నేను మానవరూపంలో అవతరించి, వారికి బదులుగా నేను అనుభవించినచో, నా భక్తులను ఈ కర్మ నియమమునుండి విడిచి పెట్టవలయును. ఈ ప్రకారముగా, నేను సైతము లొంగిపోయి, ధర్మ దేవునకు ఎదురులేకుండా చేసియున్నాను.

నన్నె శిక్షించుకొందు నధర్మమైన
వాలి వధకు నా పదముస వ్యాధశరము,
ధర్మమే గొప్ప బ్రహ్మంబు తక్కువ గద!
మరచిపోకుము దత్తుని మంచిమాట. 99

తా॥ నేను ఒకవేళ పరిస్థితులనుబట్టి అధర్మము చేసినా, నన్ను నేనే శిక్షించుకుంటాను. నేను చేసిన వాలి వధకు, చెట్టుచాటునుండి బోయ వాని బాణమున పాదములో కృష్ణావతారమున కొట్టబడితిని గదా! బ్రహ్మము కన్న ధర్మమే ఎక్కువ అని లోకమునకు చాటి చెప్పితిని.

ఇచ్చితి విమర్శతో తీర్పునచ్చటను,
చూచుచుందురు మునులును సురులు నన్నె,
నన్నె శిక్షించుకొంటి నన్యా శరహతుడ,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 100

తా॥ ఆ లోకంలో ఎంతో పరిశీలించి తీర్పులనిచ్చాను. నన్ను సదా ఋషులు దేవతలూ రెప్పవాల్చకుండా చూస్తుంటారు పక్షపాతమును చూపలేను. అధర్మఫలముపై నాపై నేనే తీర్పులు యిచ్చుకొని కృష్ణావతారంలో వ్యాధుని బాణంతో ప్రాణ త్యాగం చేశాను గదా.

పాపకర్మల వివరణ బద్ధ కరముల
చెప్పగా వలె జీవుండు చెల్లవచట
మాయవాక్కులు లోకుల మాయఁజేయ
మరచిపోకుము దత్తుని మంచిమాట. 101

తా॥ నీవు చేసిన పాపకర్మలకు, అచట చేయి కట్టుకొని స్వామి ఎదుట సమాధానముల సీయవలెను. ఇచట లోకులను మాయచేయునట్టి మాయ మాటలు అక్కడ చెల్లవు.

కొడుకు వినడని తప్పించుకొనియె రాజు,
అగ్ని వినడని చెప్పెను అడవి హరియు,
తెలివితేటలా పరమాత్మ తెలివిముందు!
మరచిపోకుము దత్తుని మంచిమాట. 102

తా॥ శ్రీకృష్ణ భగవానుని రాయబారమున, కొడుకు ఎంత చెప్పినా వినుటలేదని కొడుకుపై నెపమునెట్టి ధృతరాష్ట్రుడు, శాసించే అధికారము కలిగియు, తప్పించుకున్నాడు. ఆ తరువాత అతడు చివరలో అడవిలో దావాగ్ని మధ్యలో చిక్కి కృష్ణుని రక్షించమని అర్థించినాడు. అప్పుడు కృష్ణుడు సాక్షాత్కరించి అగ్నిని శాసించ గలిగియు "రాజా! ఎంత చెప్పినా అగ్ని నా మాట వినుటలేదని" తప్పించుకొన్నాడు. మానవుడు తన తెలివితేటలను పరమాత్మముందు చూపించినచో అవి నిలచునా?

ధర్మకర్తయే జీవుండు ధనములకును
వానిదే ధనమంతయు సనుసరించు
పాప పుణ్యంబులే ఏది పట్టుకొనడు
మరచిపోకుము దత్తుని మంచిమాట. 103

తా॥ జీవుడు కేవలము ఒక ధర్మకర్త వంటివాడే. ఈ ధనమంత యును భగవంతుని ఆస్తియే. జీవుడు పోయేటప్పుడు ఈ ధనములో దేనిని

కొనిపోడు. ఈ ధన విషయమున తాను వ్యవహరించినట్టి పాపపుణ్యము లను మాత్రమే తన వెంట కొనిపోవును.

వ్యాఘ్రవేషాన భయపడు వ్యాఘ్రబలికి,
భయపడడు, శిశువు గుణాంబరయుబోడు,
విదులు గుణతత్త్వ విజ్ఞులు వేరుభువిని,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 104

తా॥ అజ్ఞానులగు బాలురు పులివేషగానిని చూచి భయపడుదురు. నిజంగా పులి బలము కలవానిని చూచి భయపడరు. వీరు నామరూప భ్రాంతులే తప్ప తత్త్వమును గుణమును తెలియజాలరు. జ్ఞానులగు వారు పులివేషగానిని చూచి భయపడరు. పులి బలముకల వానిని చూచి భయ పడుదురు. జ్ఞానులు గుణతత్త్వవేత్తలు. నామరూప భ్రాంతి కలవారు కారు. అజ్ఞాని-జ్ఞాని భేదమిదే.

ఫలము కోరక అభిమాని ప్రాణమిచ్చు
చలన చిత్ర నాయకునికి సత్యభక్తి
వాడె గురువు దుర్లక్ష్యంబు వదలు మచట
మరచిపోకుము దత్తుని మంచిమాట. 105

తా॥ ఒక సినిమా హీరో మరణించగా, వాడి అభిమాని, ఎట్టి ప్రతిఫలాపేక్ష లేకుండగ, వాడు ప్రాణత్యాగము చేయుచున్నాడు. అట్టి వెర్రి అభిమానిని గురువుగా తీసుకొని నీవును భగవంతుని వెర్రి అభిమానివి కమ్ము. వాని వెర్రి ప్రేమ సత్యభక్తియేకాని వాడి లక్ష్యము సినిమా హీరో అయినందున వాడు చెడినాడు. వాని లక్ష్యమును వదలి భగవంతుని లక్ష్యముగ నుంచుకొన్న తరించును. కాన వాని చెడు లక్ష్యమును వదలి, వాని వెర్రి ప్రేమను మాత్రము గ్రహించుము.

కొండనెక్కుట కష్టంబు, కొండనుండి
జారిపడుటయో తేలిక, సాధనమున
సిద్ధి యోగంబు భ్రష్టుడు చెడుటయిట్లు
మరచిపోకుము దత్తుని మంచిమాట. 106

తా॥ కొండనెక్కుట చాల సమయము పడుతుంది. చాల కష్టము కూడ. కానీ కొండనుండి జారిపడుట క్షణము చాలును. చాల తేలిక. ఇలానే సాధనలో దైవమును చేరుట చాల కష్టము చాల కాలము పట్టును. ఆ దైవానుగ్రహము తప్పి యోగ భ్రష్టుడగుట చాల స్వల్పకాలంలో చాల సులభంగా జరుగుతుంది.

అట్టడుగున ఉండుము అందరికిని,
పతనముండదు, పూజించు పతిత నరుల,
స్వామి రూపంబు కావచ్చు నేమియైన,
మరచిపోకుము దత్తుని మంచిమాట 107

తా॥ అందరికీ అట్ట అడుగున అధమాధమునిగా జీవించుము. అక్కడనుండి నీ కెన్నటికీ పతనము లేనిచోటు అది. అధములను సైతము పూజించుము. ఏమో! స్వామియే ఆ అధముడి రూపములో వచ్చాడేమో. వానిని నిందించిన స్వామి నింద అగునుగదా!

పంచదార గాడిద తీపి బాగుగాను
మట్టి చిలక రుచింపదు మానవునకు
స్వార్థరహిత సహిత కర్మసరణి నాకు
మరచిపోకుము దత్తుని మంచిమాట. 108

తా॥ గాడిద బొమ్మ అయినా పంచదారతో చేసినది మధురముగ నుండును. చిలకబొమ్మ అయినా మట్టితో చేసినది మనుజునకు రుచించదు. అట్లే స్వార్థ రహితమైన పిచ్చిగంతుల భజన అయినా భగవంతునికి మధురముగా ఉండును స్వార్థముతో కూడిన పవిత్ర యజ్ఞమైనను భగవానునికి రుచించదు. ఆరాధనా విధానమేది? అనికాదు. ఆ విధానము స్వార్థరహిత నిర్మల ప్రేమతో కూడినదా? లేదా? అనునదే భగవంతునకు ప్రధానము.

**కాలదేశ విధానాలు కానరావు**
**సత్య నిస్స్వార్థ భక్తుని సరణిలోన,**
**తల్లి పసిపాప రీతిగా తత్త్వభక్తి,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 109**

తా॥ నిజమైన స్వార్థము నాశించని భక్తిలో ఒక సమయము, ఒక ప్రదేశము, ఒక విధానము ఉండదు. తల్లి తన పసిపాపపై ప్రేమను చూపునట్లు, భక్తి, కాల- దేశ-విధాన-స్వార్థములకు అతీతము.

**ప్రతిది నాది నీ బిడ్డపై పలుకు నొకటి**
**పలుకుచుందువే? నన్నేల పలికెదవటు,**
**సహజ రాగముఁ జూపుము సత్యభక్తి,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 110**

తా॥ ప్రతిరోజు ఉదయము నీ బిడ్డపై ఒకే ఒక మాటతో నీ ప్రేమను చూపుచున్నావా? మరి, ప్రతిరోజు నన్ను ఒకే స్తోత్రముతో నేల పూజిస్తున్నావు? అంటే నాపైన సహజమైన ప్రేమ లేదు. సహజ ప్రేమయే సత్యమైన భక్తి. దానిని నాపై జూపుము.

**కాలమునఁ దోచు పలుకుల కర్మతోడ**
**బిడ్డనెట్లు ప్రేమింతువో పిలచి, అతుల**
**నన్ను ప్రేమించుము సహజమున్న నిజము,**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 111**

తా॥ ఆ సమయంలో ఏ మాటలు తోస్తే ఆ మాటలతోను, ఏ చేష్టలు తోచిన ఆ చేష్టలతోను, నీ బిడ్డను పిలిచి ఎట్లు ప్రేమను చూపుదువో అట్లే నాపై ప్రేమను చూపుము. సహజమైనది సత్యము. ఒక కాలము, ఒక విధానము, ఒక స్తోత్రము అసహజములు కాన అసత్యములు.

**ఆచరణమున శూన్యుడై అరవనేల?**
**అరువది కృతుల వ్రాసియు నతడు శుంఠ,**
**రావణాసుర పాండిత్య మవని పృథయె**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 112**

తా॥ ఆచరణంలో ధర్మము శూన్యమైయుండ అరువది గ్రంథములను రచించియు, వాటిని ఘోషించిననూ వ్యర్థమే. అట్టివాడే శుంఠ. అట్టివాని పాండిత్యము రావణాసురుని పాండిత్యమనబడును. అది వ్యర్థము.

**దేవుడున్నాడని తెలిసి భావమందు**
**లేని రీతిగ కర్మలు, వాని నతడు**
**భావతుష్టితో శిక్షించు ప్రతికృతియగు**
**మరచిపోకుము దత్తుని మంచిమాట. 113**

తా॥ దేవుడున్నాడని మనసులో తెలియును. కానీ ఆచరణంలో దేవుడు లేనట్లుగా పాపములను జీవుడు చేయుచున్నాడు. జీవునికి ప్రతిబింబమే పరమాత్మయొక్క చేష్టలుండును. భగవంతుడు, అట్టి జీవుడి స్తోత్రములకు మనసులో అభినందించుచూ, ఆచరణములో ఆ జీవునికి వాని పాప శిక్షలను వేయుచుండును.

అతడి ఆజ్ఞచే భూతంబు లదరినడచు
సూర్యవాతాదులే, నలుసులగు నరులు
నడవవలె రాజులైన వినయముతోడ,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 114

తా॥ దేవుని ఆజ్ఞచేత పంచభూతములే అదరి నడచుచుండును. సూర్యుడు, వాయువు మొ॥నవి కూడ భయపడుచుండును. ఇక ఈ మనుషులు నలుసుల వంటివారు. అట్టి మానవులకు అహంకారమేల? రాజులైననూ ఆ దేవుని స్మరించి, వినయముతో ప్రవర్తించవలెను.

మనసు మనసుతో వాక్కును మాటచేత
సేవ సేవతో చెల్లించు దైవమెపుడు
ఊరి ఊరికి దూరంబు ఉన్నదొకటి,
మరచిపోకుము దత్తుని మంచిమాట 115

తా॥ మనసుతో ఆరాధించిన వానికి మానసికానందమునిచ్చి, వాక్కుతో పొగడిన వానికి జ్ఞాన వాక్యములను చెప్పి, క్రియాత్మకంగా సేవచేసిన వానికి క్రియాత్మకంగానే సేవచేయు మేధావి దేవుడు. నీ ఊరి నుంచి అతడి ఊరికి ఎంత దూరమో, అతడి ఊరినుండి నీ ఊరు అంతే దూరము.

సాధువంచనా హింసలే సత్యమఘము,
తన్నివారణ పుణ్యంబు, ధర్మకర్మ
సహకరించిన పరమాత్మ సంతసించు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 116

తా॥ సాధువులను వంచించుట, హింసించుటయే నిజమైన పాపము. అట్టి పాపమును జరుగకుండా నివారించుటయే పుణ్యము. ఈ పుణ్యమును

చేయువాడే ధర్మమును ఆచరించినవాడు. పరుల విషయము నాకెందుకని ఉపేక్షసేయక, కలుగజేసుకొని, శక్త్యనుసారము ధర్మరక్షణ చేయవలెను. అది భగవంతుని కర్తవ్యములో ఆయనకు సహకరించుట. ఇది ఆయనకు చాలా ప్రీతికరము.

మాయ నాటకంబిది నీకు జాయ ఎవరు?
పుత్రులెవరురా నీకు? సద్బుద్ధి కనుము
పాత్రలన్నియు మారును పరభవమున
మరచిపోకుము దత్తుని మంచిమాట. 117

తా॥ ఇదంతయును మాయానాటకము. నీకు భార్య ఎవరు? పుత్రులెవరు? సద్బుద్ధితో ఆలోచించుము. వచ్చే జన్మలో ఈ జీవులు వేరు వేరు పాత్రలను నటులవలె ధరించి మరొక మాయా నాటకమున పాల్గొందురు.

నీకు నేనె బాంధవుడను, నిత్యమిచట
జన్మలన్నింట బంధంబు సాగుచుంట,
సర్వబంధువులును నేనె సత్యమిదియె,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 118

తా॥ ఈ జగత్తులో నీకు నిత్య బంధువును నేనొక్కడనే. ఏలనన ప్రతి జన్మలోనూ నీకూ నాకూ యిప్పటి బంధమే కొనసాగును. కాన సర్వ బంధువులు నీకు నేనే. ఇది సత్యము.

రాధ త్రాగగా కందెను బాధ తోడ
అదియె రుక్మిణి త్రాగును అదియె వేడి
స్వామియైనను సన్నిధి చవక యగును
మరచిపోకుము దత్తుని మంచిమాట. 119

తా॥ రోజూ త్రాగే వేడిపాలనే రుక్మిణి, రాధ, మధురకు రాగా రాధ కిచ్చినది. రాధ త్రాగగా స్వామి కందిపోయి బాధపడెను. రాధా హృదయ వాసినని నిరూపించెను. రుక్మిణి రోజూ త్రాగుచున్ననూ కందిపోలేదు. నిత్య సాహచర్యంవల్ల స్వామి విలువను పూర్తిగా రుక్మిణి గ్రహించలేకపోయెను. కాన దగ్గరగా ఉన్నచో భగవానుడైననూ విలువ కోల్పోయి చవక యగును.

విలువఁదెచ్చు వియోగంబు వేదనమున
విలువ పోగొట్టు యోగంబు విశ్వమందు
రాధ దూరాన రుక్మిణీ రమణి వెంట
మరచిపోకుము దత్తుని మంచిమాట. 120

తా॥ దగ్గరలేని వ్యక్తిపై విలువ కల్గించు వేదన పుట్టును. అదే వ్యక్తి దగ్గరనున్నచో యీ లోకంలో విలువపోతుంది. దూరంగా రేపల్లెలోనున్న రాధ స్వామిపై ఎంతో విలువ కలిగియుండెను. దగ్గరగానున్న రుక్మిణికి స్వామిపై విలువ తగ్గెను గదా!

కృష్ణ శాసన మొల్లక వృష్ణి జనము
కొట్టుకొని చచ్చె సురను గ్రోలియున్న,
నిత్యసన్నిధి నిర్లక్ష్య సత్కరము
మరచిపోకుము దత్తుని మంచిమాట. 121

తా॥ కృష్ణుడు సురాపానము చేయరాదని శాసించి భారత యుద్ధమునకు పోయెను. కాని కృష్ణుని ఆజ్ఞను నిర్లక్ష్యముచేసి మద్యపానము చేసి యాదవులు కొట్టుకొని మరణించిరి గదా! కావున నిత్యము కలిసి ఉండుట వలన, స్వామిపైనను నిర్లక్ష్యమేర్పడి అనాదరము కల్గును. కావుననే దేవుడు కనపడక దూరముగనున్నాడు ఇది నరుల సహజ స్వభావము.

స్వామి కీర్తిని చాటుట స్వకృతములకు
స్వామి కర్తగా చెప్పుట స్వార్థరహిత
సేవయే స్వామి ప్రీతికి సిద్ధ పథము
మరచిపోకుము దత్తుని మంచిమాట. 122

తా॥ తనను గురించి ఆలోచించకుండా, స్వామిని గురించి ప్రచారము చేయుచు, తాను చేయు అన్ని పనులయొక్క గొప్పతనమునకు స్వామి కర్తయని స్వామికే కీర్తి సర్పించుట అను సేవయే స్వామికి ప్రీతికరము. అదియే సిద్ధిప్రద మార్గము.

దత్త గురువాక్య దీపాలు, ధర్మతైల
దీప్తములు, తత్త్వవేదాస్త దీధితులును,
ఇహ పరాధ్వము దర్శించ నివియె సఖులు,
మరచిపోకుము దత్తుని మంచిమాట. 123

తా॥ ఈ పద్యాలు శ్రీ దత్త గురుదేవుల వాక్యాలు. ఈ వాక్యములు, ధర్మశాస్త్రమను తైలముతో వెలుగుచు, తత్త్వమగు వేదాంత శాస్త్రమను కాంతిని వెదజల్లునవి. ఇహమునందును పరమునందును మార్గమును దర్శింపచేయుటకు జీవునకు మిత్రులవంటివి. ఇట్టి శ్రీ దత్తుని మంచి మాటలను మరచిపోకుము.

డా॥ జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి
M.Sc. Phd.
దత్త భక్తులు



శ్రీ గురుదత్త



జయ గురుదత్త

# శ్రీ దత్తాత్రేయ క్షేత్రములు

1. మాహురము
2. గిరినార్
3. కరంజ
4. ఔదుంబర్
5. నరసోబావాడి
6. గాణుగాపురం
7. కొల్హాపూర్
8. నాశిక్
9. కురుగడ్డ
10. పాంచాలేశ్వరము
11. నరేశ్వర్
12. గరుడేశ్వర్
13. ఖట్ గాంవ్
14. పిఠాపురం
15. మాణిక్యనగర్
16. అక్కలకోట
17. ఖేడగాం
18. షిరిడి
19. పుట్టపర్తి
20. దత్తపీఠం మైసూరు



దత్త భక్తులు గోపాలకృష్ణమూర్తిగారు

# శ్రీ దత్త దివ్యవాణి

**శ్లో॥ సృష్టి స్థితిప్రళయ కారణ మస్యవేదా**
**ద్బ్రహ్మైవయ త్రిముఖ సూచక దత్తదేవ**
**అన్యస్వరూప మసమన్వయ హేతుముక్తం**
**తస్మాత్స ఏవ శరణం మమ వేదసిద్ధ.**

తా॥ వేదములో చెప్పిన బ్రహ్మము - నిర్వచన మేమనగా - ఈ జగత్తు యొక్క సృష్టి స్థితి ప్రళయములను చేయు ఏకైక స్వరూపమే బ్రహ్మము- మూడు ముఖములతో యీ మూడు పనులను చేయు ఏకైక స్వరూపమగు శ్రీ దత్తదేవుడే వేదముద్వారా సిద్ధించిన బ్రహ్మము కావున మాకు శరణ్యుడు. ఇతర స్వరూపములందు యీ వేద సమన్వయము కుదరదు కావున వాటిని విడచినాము.

ఓం శాంతిః శాంతి: శాంతి: